క్లుప్తంగా

రేషన్ డోర్ డెలివరీ నిలిపివేయటం దారుణం

నరసరావుపేట: రేషన్ డోర్ డెలివరీ నిలిపివేయటం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ డోర్ డెలివరీ నిలిపివేయటంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని, అలాగే ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోయారని వివరించారు. వారందరికీ మద్దతుగా తాము పోరాడతామన్నారు. పాలకుల నిర్వాకం వల్ల రేషన్ డోర్ డెలివరీ చేసే సుమారు 9260 ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)లు కుటుంబాలు నేడు వీధిన పడ్డాయన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ఎలక్షన్ ముందు వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి రాగానే లక్షలాది మంది వలంటీర్ల ఉద్యోగాలు తీసి వేసిందని విమర్శించారు. అలాగే ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేసే సహాయకుల ఉద్యోగాలు, ఇప్పుడు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వారి ఉద్యోగాలు తీసేయడం దారుణమన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1720 ర్యాంక్


మధుసుదనరెడ్డి

నరసరావుపేట రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో మండలంలోని రంగారెడ్డిపాలెంకు చెందిన విద్యార్థి యేరువ మధుసుదనరెడ్డి ప్రతిభ చాటాడు. జాతీయస్థాయిలో 1720 ర్యాంక్, ఈడబ్ల్యూఎస్ విభాగంలో 153వ ర్యాంక్‌ను సాధించాడు. మధుసూదనరెడ్డి 10వ తరగతి వరకు పట్టణంలో, ఇంటర్మీడియెట్ విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో విద్యనభ్యసించాడు. తల్లిదండ్రులు కష్టపడి వ్యవసాయం చేస్తూ తనను చదివించారని మధుసుదనరెడ్డి తెలిపాడు. చెన్నై ఐఐటీలో సీటు వస్తుందని భావిస్తున్నట్టు వివరించాడు. జేఈఈలో ఉత్తమ ర్యాంక్ సాధించిన మధుసుదనరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

ప్రపంచ ప్రార్థన దినోత్సవానికి సిద్ధం కండి

పాస్టర్ నందమూరి క్రిస్టర్



చిలకలూరిపేటటౌన్: ప్రతి ఉదయం 50 మంది దైవ సేవకులు దేశ ప్రజల క్షేమం కోసం చేస్తున్న ప్రార్థనలు సోమవారం ఉదయం పట్టణంలోని ఏసు క్రీస్తు దివ్యకాంతి నిలయంలో జరిగాయి. ఈ కార్యక్రమ నిర్వాహకులు పాస్టర్ ఎంఎస్ మూర్తి (సూరిబాబు) అధ్యక్షతన జరిగిన ప్రార్థనల అనంతరం పాస్టర్ ఎస్ క్రిస్టర్ ప్రసంగించారు. ఈస్టర్ నుంచి పెంతెకోస్తు ఆదివారం అయిన జూన్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 50 రోజుల పాటు నిర్వహించే ఉదయకాల ప్రార్థనలు సోమవారం 44వ రోజుకు చేరుకున్నాయని తెలిపారు. జీయూపీఎఫ్, జేపీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దేశంలో శాంతి, భద్రత కోసం చేసే ఈ ఉదయకాల ప్రార్థనలు ప్రతిరోజు ఒక చర్చిలో కొనసాగుతున్నాయన్నారు. మరో ఐదు రోజులు ఇలానే కొనసాగుతాయని, చివరిరోజైన 8వ తేదీన ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో భారీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముగింపు ప్రార్థనలకు నియోజకవర్గంలోని క్రైస్తవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.థామస్, అబ్రహం, సంసోను, జి.బుజ్జి, కె.శాంతిసాగర్, కోటి వీరయ్య, క్రీస్తురాజు, డి.జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

81 మంది పింఛనుదారులకు నగదు పంపిణీ

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు, పిచికలపాలెం గ్రామాల్లో పింఛనుదారులకు నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు ఆయా గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు పింఛనుదారుల ఇళ్లకే వెళ్లి గత నెలలో నిలుపుదల చేసిన నగదు,ప్రస్తుతం ఈనెలకు సంబంధించిన నగదు కలిపి పింఛనుదారులకు అందజేసినట్లు తెలిపారు. పోట్లూరు-72, పిచికలపాలెం-09 పింఛనుదారులకు నగదు ఇవ్వటంతో అందరు సంతోషంగా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

క్వారీలో పడి వేలూరు వాసి మృతి

నాదెండ్ల: గణపవరం-వేలూరు వెళ్లే డొంక రోడ్డులో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్వారీలో పడి గత నెల 26న వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటనలో మృతుడిని పోలీసులు గుర్తించారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన మల్లా జెట్టియ్య (30) గత నెల 26 చేపలు పట్టేందుకు క్వారీ గుంత వద్దకు వచ్చి అందులో పడిపోయాడు. 29న అటుగా వెళ్తున్న స్థానికులు గుంతలో మృతదేహం తేలియాడుతున్న విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసిన దర్యాప్తులో జెట్టియ్యగా గుర్తించారు. జెట్టియ్యకు ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

చేనుకు చేవ - రైతుకు లాభం

- సేంద్రియ ఎరువుల వాడకం ఎంతో మేలు
- పశువుల పేడలో పోషకాల శాతం అధికంగా


పశువుల పేడను పొలాలకు తొలుతున్న రైతులు

శావల్యాపురం: తొలకరి జల్లులు పడటం.. వాతావరణం చల్లబడటంతో అన్నదాతలు ఖరీఫ్ సీజను సాగుకు సమాయాత్తమవుతున్నారు. రసాయనిక ఎరువులు వినియోగం పెరగటం వల్ల భూమిలో పోషకాల శాతం తగ్గిపోతుందన్న వ్యవసాయ అధికారులు సూచనలు-సలహాల మేరకు రైతులు సేంద్రియ ఎరువులు వినియోగం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇందుకుగాను రైతులు పశువుల పేడను పొలాల్లో తొలుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

పెట్టుబడులు తగ్గుదల

పంటకు ప్రయోజనంతో పాటు పెట్టుబడులు తగ్గి దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయి. వినుకొండ నియోజకవర్గంలో ఏరువాక పౌర్ణమి నాటికి రైతులందరూ తమ ఎరువు దిబ్బలను పొలాలకు తొలుకుంటున్నారు. ప్రధానంగా పశువుల ఎరువు వర్మీ కంపోస్టు గొర్రెల మేకల కోళ్ల ఎరువులను పంట పొలాలకు వాడుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగం దఫాలు వారీగా వినియోగిస్తే భూమిలో పోషకాల శాతం పెరిగి భూసారం కూడా మరింత వృద్ధి చెందుతుంది.

మొదట దశలో పశువుల పేడను వేసుకుంటే పంట దిగుబడికి దోహదపడుతుంది. ఎరువులు వేసుకున్న తదుపరి దుక్కులు దున్నుకుంటే పైరు ఎదుగుదలకు మొక్కలు బలంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు పశువుల పేడను ఎరువుగా ఉపయోగించాలి. దీనిలోని సహజ సిద్ధ లవణాలు పంటకు లాభపడతాయి. భూమిలో ఉన్న అమ్లాలు క్షారాల స్థాయిని నిలబెడతాయి. నేలలో సూక్ష్మ జీవుల వృద్ధికి తోడ్పడుతుంది.

శావల్యాపురంలో...

శావల్యాపురం మండలంలో 15 గ్రామ పంచాయతీలో మాగాణి, మెట్ట భూములు 18 వేల ఎకరాలు ఉండగా 9 వేల మంది రైతులు వరి, పొగాకు, మిర్చి, మొక్కజొన్న, మినుము, శనగ, తదితర పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం అన్నదాతలు పశువుల పేడను తమ పొలాలకు తొలుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి



సేంద్రియ ఎరువులు తయారీ కోసం ప్రభుత్వం జనుము పిల్లి పెసర, జింకు, జిప్సమ్, జీలుగలు తదితర విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై మంజూరు చేస్తాం. రసాయనిక ఎరువులు వినియోగం పెరగడం వలన భూమిలో ఉన్న పోషకాలు శాతం తగ్గిపోతుంది.

– బోయపాటి రవిబాబు, వ్యవసాయ అధికారి, వినుకొండ

రేపు 'వెన్నుపోటు దినం'.. విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పిలుపు
- పోస్టర్ ఆవిష్కరణ


వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అరాచక, అవినీతి విధానాలకు నిరసనగా నాల్గవ తేదీ బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పిలుపు ఇచ్చారు. సోమవారం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా వారిని మోసగిస్తూ పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వ అరాచక, అవినీతి విధానాలకు నిరసనగా జూన్ నాల్గున పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నిరసన ర్యాలీ సందర్భంగా గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి శివుడు బొమ్మ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి ఈ ప్రభుత్వ అరాచక, అవినీతి పాలన నిరసనగా ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, జి.అచ్యుతరావు, షేక్ కరిముల్లా, ఎస్.సుబ్బారెడ్డి, ఏ.శివకోటి, షేక్ రహమాన్, జి.కోటేశ్వరరావు, పొలయ్య, అనీల పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేసిన ఎస్ఐ


పల్లెనిద్ర చేస్తున్న ఎస్ఐ

- ఎస్పీ ఆదేశాలతో పోలీసు అధికారుల పల్లెనిద్ర
- గ్రామస్తులతో సమావేశాలు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలు నాదెండ్ల మండలం కనపర్రు, రొంపిచర్ల మండలం తురుమెళ్ళ, నకేరికల్లు మండలం చీమలమర్రి, గురజాల మండలం బోదవాడ, సత్తెనపల్లి పట్టణంలోని 22వ వార్డులో పోలీసు అధికారులు సోమవారం రాత్రి బసచేసి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పరిస్థితులపై ఆరాదీశారు. ప్రస్తుత పరిస్థితులపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు, సైబర్ మోసాల బారిన పడకూడదని, అపరిచితుల కాల్స్, లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఎట్టి పరిస్థితులలో ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు అవగాహన చేస్తున్నారు. గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకునే బాధ్యత పోలీసు అధికారులకు ఉంటుందని, అందుకోసం గ్రామాలలోని ప్రజలు తమవంతు బాధ్యతగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామాల్లోని యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. గ్రామాలలో ఎటువంటి చిన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, పేకాట, నాటుసారా, అక్రమ మద్యం విక్రయాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకొని వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ డౌన్‌లోడు చేసుకొని వారి ఏమైనా ఇబ్బంది ఉంటే తెలియజేయాలని తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో నకరికల్లు, రొంపిచర్ల, గురజాల, సత్తెనపల్లి, నాదెండ్ల ఎస్ఐలు ఎస్ఐ సురేష్ బాబు, పనికృష్ణ, వినోద్, పవన్ కుమార్, పుల్లారావు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా అందించాలి

ఎంఈవో కె.నాగేశ్వరరావు


బహుమతులు అందజేస్తున్న ఎంఈవో నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్: నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో కె.నాగేశ్వరరావు తెలిపారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజన తయారీ తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేశారు. ఈనెల నుంచి సన్న బియ్యాన్ని మధ్యాహ్న భోజన తయారీకి ప్రభుత్వం అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న భోజనం తయారీదారులు, సహాయకులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కాగ్నిజెంట్‌లో ఉద్యోగాలకు 42 మంది ఎంపిక



నరసరావుపేట రూరల్: ప్రముఖ బహుళజాతి సంస్థ కాగ్నిజెంట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 42 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్ బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అభినందించారు.

కళాశాలలోని విద్యార్థులకు రెండవ సంవత్సరం నుంచి ప్రాంగణ ఎంపికలకు అవసరమైన కోడింగ్ శిక్షణ ఇస్తున్నట్టు కోటేశ్వరరావు తెలిపారు. కాగ్నిజెంట్ ఫేజ్-1 ఎంపికలో 37 మంది, ఫేజ్-2లో42 మంది విద్యార్థులతో మొత్తం 77 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు వివరించారు.

తిరునాళ్లల్లో కళారూపాల ప్రదర్శన అభినందనీయం

విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేసిన గోపీచంద్, చినరామిరెడ్డి, మురళి

నరసరావుపేట: సమాజంలో మంచి, నీతిని పెంచి, చెడును, దుర్నీతిని తుంచి, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పౌర సమాజం, ప్రభుత్వం పైన ఉందని, ఈ దిశలో కోటప్పకొండ లాంటి తిరునాళ్లలో కొన్ని నాటక కోలాటాల సమాజాలు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో మంచి చిత్రాల అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న కోటప్పకొండ తిరుణాలలో మంచి కళారూపాలు ప్రదర్శించిన పలు సమాజాల నేతలకు అభినందన, సత్కారసభ నిర్వహించారు. స్థానిక ప్రజాకళా సంస్థల నేతలు చింతలచెర్వు అమరేంద్ర, శ్రీనాథ సాహితి పరిషత్ వ్యవస్థాపకులు స్వర్ణ చినరామిరెడ్డి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య అన్నదాన కమిటీ కన్వీనర్ బత్తుల మురళి, విశ్రాంత ఉపాధ్యాయునులు కనగాల ఉదయలక్ష్మి, ఈదర నాగశిరోమణి ఈ సభలో బహుమతి ప్రదాతలుగా పాల్గొని దుశ్శాలువతో సత్కరించి, శతాబ్ది గాయకుడు ఘంటసాల వెయ్యి పేజీల, రూ.1600 విలువైన పాటల బృహత్ గ్రంథాలను ఆయా కళారూపాల పోటీ విజేతలకు అందజేశారు. నాయుడు విమల, జెట్టి పద్మ (కావూరు శ్రీ విఘ్నేశ్వర మురళీ మహిళా కోలాటం),113 తాళ్లూరు నుంచి గొట్టం ఆంజనేయులు (బ్రహ్మంగారి పూర్తి నాటకం), రొంపిచర్ల చక్రవరం రమేష్ రాజు (బ్రహ్మంగారి నాటకం, కోలాటం), కావూరు ఆంజనేయులు, సింగర కొండయ్య (కాకతీయ కళా వేదికపై పద్య నాటకాలు), కర్ణాటి కృష్ణమూర్తి (మంచి సినిమా పాటల కచేరి) ఈ సత్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. మంచి చిత్రాల అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈదర గోపీచంద్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, గ్రామీణ జానపద కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడిందని, మంచి కళలను, గ్రంథాలయాలను, పుస్తక పఠన సంస్కృతిని, పౌర సమాజాలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంస్థ కోశాధికారి కాసు జోగిరెడ్డి తొలుత స్వాగతం పలికారు. కీ.శే. గుమ్మడి, రుద్ర రామారావులకు జోహార్లు ప్రకటించారు.

పాలకుల తీరుపై గర్జించిన కమ్యూనిస్టులు


చిలకలూరిపేటలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజలు


రొంపిచర్లలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు


శావల్యాపురంలో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ పార్టీ నేతలు


వినుకొండలో తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చిలకలూరిపేట: అర్హులైన పేదలకు నివేశన స్థలాలు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున పేదలకు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. కనీసం లబ్ధిదారుల ఎంపిక, స్థలాల సేకరణపై స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో కూడా దాటవేత ధోరణి కనిపిస్తున్నదన్నారు. ఇచ్చిన హామీని ఇప్పటికైనా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని లేకుంటే వాటిని సాధించుకునే వరకు ఉద్యమ ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మలతో పాటు పార్టీ నాయకులు మల్లికార్జునరావు, రాము, నవీన్, అంజయ్య, చౌటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకుంటున్న ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి నేడు ఆ పథకాలు ఊసే లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు అందజేస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. హామీలను అమలు చేయని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ బి.నిర్మలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి జమ్ములమూడి వెంకటేశ్వర్లు, సీపీఐ సీనియర్ నాయకులు తానం మత్తయ్య, ముప్పూరి మధుసూదనరావు, సీపీఐ మండల నాయకులు పిడెం హుస్సేన్, తన్నీరు కోటయ్య, వెన్నా గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాయబారం వందనం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలంటూ ధర్నా అనంతరం తహసీల్దారు యం.అర్జున నాయక్ వినతిపత్రం అందజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా నేటి వరకు ఇంటి నివేశిత స్థలాల గురించి మాట్లాడకపోవటం చాలా దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నేతలు జల్లి వెంకటేశ్వర్లు, నక్కా శ్రీదేవి, ఆర్.లక్ష్మయ్య ఉన్నారు.

వినుకొండలో..

వినుకొండ: అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలలు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా భారీ సంఖ్యలో మహిళలు కార్యాలయం వద్దకు ర్యాలీగా బయలు దేరి తహసీల్దార్ సురేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవపూడి రాము మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతింటి కలనెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు గృహాలు నిర్మించుకునేందుకు 1.8 లక్షలు రుణం సరిపోదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు సెంట్లు స్థలం ఇస్తామనే హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు పఠాన్ లాల్‌ఖాన్, షేక్‌నాగూర్, సుబ్రమణ్యం, సుబ్బారావు, ఫాతిమా, వంగల బ్రహ్మం, మున్ని, అబ్రహంలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఖరీఫ్ సాయం అందించండి


తహసీల్దార్‌కు కౌలు రైతులు వినతి


యడ్లపాడు తహసీల్దార్ జెట్టి విజయశ్రీకి వినతి అందిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

యడ్లపాడు: అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులకు పంట పెట్టుబడి సహాయం రూ.20 వేలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్థానిక కౌలు రైతులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. కౌలురైతు సంఘం నాయకులు రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, నాయకులు కల్లూరి రామారావు, గోగడ హరిబాబు, నూతలపాటి కాళిదాసు కౌలు రైతులతో కలిసి ఈ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ భూమి లేని వ్యవసాయ కూలీలు భూ యజమానుల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తుండగా, ప్రస్తుతం పెట్టుబడి సహాయం లభించక పంట సాగు చేయడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు రైతులకు ఏటా పెట్టుబడి సాయంగా కేంద్రం రూ.6వేలు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సంవత్సరానికి రూ.14వేలను మూడు విడతలుగా జమ చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించారన్నారు. అలాగే కౌలు రైతులకు కూడా రూ.20వేలు ఇవ్వబోతున్నట్లు తెలిపినా, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంకా వాటికి సంబంధించిన విధివిధానాలు వెల్లడించలేదని వారు విమర్శించారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉండగా, కేవలం 50 లక్షల మంది మాత్రమే అర్హులుగా గుర్తించబడ్డారని, మిగిలిన 22 లక్షల మంది వ్యవసాయ కూలీలే భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పరిస్థితి ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో రైతుసేవా కేంద్రాల ద్వారా అర్జీలు స్వీకరించి, వీఆర్వో, వ్యవసాయశాఖ సమన్వయంతో గ్రామ సభల ద్వారా అర్హులైన కౌలు రైతులను గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల మద్దతు నిధిని ఇవ్వాలని వారు స్పష్టం చేశారు.

ఘనంగా వల్లభేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


శ్రీవల్లభేశ్వరస్వామి మూలవిరాట్


హోమం నిర్వహిస్తున్న భక్తులు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మన్మహా మల్లేశ్వర మహాదేవర (శ్రీ వల్లభేశ్వరస్వామి) స్వామి ఆలయ 7వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభించారు. విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మల్లిశెట్టి అనూషా నాయిడు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. వందలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సభ్యులు ఏర్పాట్లను పరివేక్షించారు.

కక్షలకు దూరంగా గ్రామస్తులు మసలుకోవాలి

నాదెండ్ల ఎస్సై పుల్లారావు



నాదెండ్ల: గ్రామాల్లో కక్షలు కార్పణ్యాలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. కనపర్రు గ్రామంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా పల్లెలు ఉన్నపుడే ప్రశాంతమైన జీవనానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాజకీయ ప్రేరేపిత ఘర్షణల్లో భాగస్తులై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసేలా వ్యవహరించే, రెచ్చగొట్టే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, బెట్టింగ్, కోడిపందేలు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ నేరమని, శిక్షలు తప్పవని హెచ్చరించారు.